
సాక్షి పల్నాడు

సోమవారం । 6 । జనవరి । 2025



వైభవంగా రామచంద్రస్వామి కల్యాణం

గుంటూరురూరల్: గోరంట్ల గ్రామంలోని వేంకటేశ్వరస్వామి దేవాలయం (పెద్దగుడి)లో ఆదివారం శ్రీరామచంద్రస్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 568.40 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడికాలువకు 9,567 క్యూసెక్కులు వదిలారు.

మోహిని అలంకారంలో శ్రీవారు



సత్తెనపల్లి: పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డులో గల అలివేలు మంగ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఆదివారం శ్రీవారిని మోహిని అవతారంలో జగన్మోహనకారుడిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు కుంకుమ పూజలు చేశారు.

న్యూస్‌రీల్

పీకేజీ మేజర్ కాలువకు నీటి సరఫరా పునరుద్ధరణ



కారెంపూడి: పెదకొదమగుండ్ల మేజర్ కాలువకు ఎన్ఎస్‌పీ అధికారులు ఆదివారం సాయంత్రం సాగు నీటి సరఫరాను పునరుద్ధరించారు. ప్రధాన కుడి కాల్వ నుంచి మేజర్ కాలువకు నీరు విడుదలయ్యే దగ్గరున్న గేటు విరిగిపోయి ప్రవాహానికి అడ్డుపడడంతో సమస్య వచ్చింది. దీంతో 20 రోజులుగా కాల్వకు నీటి సరఫరా లేక రైతులు ఇబ్బందులు పడ్డారు. రబీ వరి పైర్ల సాగు పనులు ముమ్మరంగా జరుగుతుండడంతో రైతులు నీటి కోసం ఆందోళన చెందారు. మూడు రోజులు ఎన్ఎస్‌పీ ఏఈ యరపతినేని రామయ్య, ఎన్ఎస్‌పీ సిబ్బంది రైతుల సహకారంతో గేటు మరమ్మతులు చేయించి నీటి సరఫరాను పునరుద్ధరించారు. కాలువకు నీటి విడుదలతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సాగు నీటి సంఘం అధ్యక్షుడు పోలయ్య, బొమ్మిన శేషగిరి తదితరులు నీటి పునరుద్ధరణ చర్యల్లో పాల్గొన్నారు.

పులిచింతల ప్రాజెక్టుపై రాకపోకలు బంద్



అచ్చంపేట: మాదిపాడు నుంచి పులిచింతల ప్రాజెక్టు అప్రోచ్ రోడ్డు వరకు బీటీ రోడ్డు, గిరిజన తండాలైన కంచుబోడు, జడపల్లి తండాలలో సిమెంట్ రోడ్లు నిర్మిస్తున్న కారణంగా పులిచింతల ప్రాజెక్టు పైనుంచి తెలంగాణకు వాహనాల రాకపోకలను నిలిపివేశారు. రోడ్డు నిర్మాణ పనులు పూర్తయ్యేంత వరకు కృష్ణానదిని దాటాల్సిన ప్రయాణికులు బల్లకట్టు, పడవల ద్వారా వెళ్లాల్సి ఉంది. మామూలుగా అయితే కార్లు, మోటారు వాహనాలకు ప్రాజెక్టుపై నుంచి వెళ్లేందుకు అనుమతులున్నాయి. హైదరాబాద్‌లో ఉండె స్థానికులు అంతా ప్రతి సంక్రాంతి పండుగకు కార్ల ద్వారా వస్తూ ఉంటారు. కాగా ఈసారి అలాంటి వారికి ఇబ్బందులు తప్పవు.

సత్తెమ్మతల్లి ఆలయానికి ఆర్టీసీ బస్సు ప్రారంభం



అచ్చంపేట: మాదిపాడు పంచాయతీ పరిధిలోని అడవిలో ఉన్న సత్తెమ్మతల్లి ఆలయానికి ఆర్టీసీ బస్సును ఆదివారం ప్రారంభించారు. భక్తుల కోరిక మేరకు ఇకపై ప్రతి ఆదివారం మాదిపాడు ఆర్ అండ్‌బీ రోడ్డు నుంచి ఆరు కిలోమీటర్ల దూరంలోని అడవిలోగల అమ్మవారి దేవాలయానికి ఆర్టీసీ బస్సును సత్తెనపల్లి ఆర్టీసీ డిపో సిబ్బంది నడుపనున్నారు. ఎన్నోఏళ్లుగా అమ్మవారి ఆలయానికి బస్సు కావాలని కోరుతున్న భక్తుల కోరిక ఈనాటికి సాకారమైంది. ఇకపై ప్రతి ఆదివారం ఉదయం 8 గంటల సమయంలో ఒకసారి, సాయంత్రం 5 నుంచి 6 గంటల లోపు మరోసారి బస్సును తిప్పనున్నారు. భక్తులు నిర్దేశించిన సమయాలకు అనుగుణంగా తమ ప్రయాణాలను కొనసాగించాలని డిపో సిబ్బంది కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వల్లభనేని వెంకటేశ్వరరావు, కొలగాని సత్యనారాయణ, తోట వెంకయ్య, షేక్ మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

సనాతన ధర్మ పరిరక్షణలో భాగస్వాములు కావాలి

త్రిదండి చిన్న జీయర్‌స్వామి

తాడేపల్లిరూరల్: హిందూ దేవాలయాల పరిరక్షణకు యువత నడుం బిగించాలని, మన సనాతన ధర్మ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వామి కావాలని త్రిదండి చిన్నజీయర్‌స్వామి పిలుపునిచ్చారు. ఆదివారం మంగళగిరి బాపూజీ విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న ధనుర్మాస మహోత్సవాలు 21వ రోజుకు చేరుకుంది. 21వ పాశురాన్ని త్రిదండి చిన్నజీయర్‌స్వామి భక్తులకు వివరించారు. అనంతరం గోదా అమ్మవారికి అష్టోత్తరం, తీర్థ ప్రసాద గోష్ఠి నిర్వహించారు. జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ గన్నవరం, నగరిక, వైజాగ్, హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి సుమారు 160 మంది భక్తులు గోదాదేవికి సారె సమర్పించి, స్వామి వారి మంగళాశాసనాలు అందుకున్నారని తెలిపారు.

ఇద్దరిని బలిగొన్న ఈత సరదా

ఆ ఐదుగురు మిత్రులు. అందరూ ఒకే పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నారు. ఆదివారం కావడంతో సరదాగా ఈతకు వెళదామని నిర్ణయించుకున్నారు. సాయంత్రం సుమారు 4.30 గంటల సమయంలో ఐదుగురు ఈతకు వెళ్లారు. పట్టణ శివారులో ఉన్న గుంటూరు బ్రాంచ్ కెనాల్‌లో ముగ్గురు ఒకచోట, ఇద్దరు మరొకచోట ఈతకు దిగారు. ఈత కొడుతుండగా ఇద్దరు గల్లంతయ్యారు. ముగ్గురు ప్రాణాలతో బయట పడ్డారు. గల్లంతైన ఇద్దరూ మృతి చెందడంతో రెండు కుటుంబాల్లో అంతులేని విషాదం అలుముకుంది.

- గుంటూరు బ్రాంచ్ కెనాల్‌లో ఈతకు వెళ్లిన ఐదుగురు విద్యార్థులు
- గల్లంతైన ఇద్దరు విద్యార్థులు మృత్యువాత
- శోకసంద్రంలో రెండు కుటుంబాలు



కాలువ నుంచి చరణ్ మృతదేహాన్ని బయటకుతీస్తున్న బంధువులు

సత్తెనపల్లి: సరదా కోసం ఈతకు వెళ్లి ఇద్దరు మృతి చెందగా ముగ్గురు ప్రాణాలతో బయటపడిన ఘటన పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో ఆదివారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని రఘురామ్ నగర్‌కు చెందిన బైకం మహేష్, రౌతు ధరణికుమార్, మున్సిపల్ ఏరియాకు చెందిన గొడుగుల హర్షవరుణ్, వడ్డవల్లి శాస్త్రీనగర్‌కు చెందిన నల్లూరి గోపీచంద్, రాజులకాలనీకి చెందిన పాదిలి చరణ్‌లు పట్టణంలోని శ్రీ రాఘవేంద్ర బాలకుటీర్ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నారు. ఐదుగురు మంచి స్నేహితులు. ఆదివారం సెలవు రావడంతో వీరు సరదాగా ఈత కొట్టేందుకు వెళ్లాలని నిర్ణయించుకున్నారు. మధ్యాహ్నం భోజనం చేసిన తర్వాత ఐదుగురు కలిసి సాయంత్రం సుమారు 4.30 గంటల సమయంలో ఈతకు పయనమయ్యారు. గుంటూరు బ్రాంచ్ కెనాల్‌లో బి.మహేష్, జి.హర్షవరణ్, రౌతు ధరణికుమార్ ఒకచోట దిగగా.. నల్లూరి గోపీచంద్, పాదిలి చరణ్ మరోచోట ఈతకు దిగారు. గోపీచంద్, చరణ్ దిగిన చోట కాలువలో లోతు ఎక్కువగా ఉండడంతో వారిద్దరూ గల్లంతయ్యారు. దీంతో మిగిలిన ముగ్గురూ భయాందోళన చెంది కాలువ నుంచి ఒడ్డుకు చేరుకున్నారు. పెద్దగా కేకలు వేస్తూ స్థానికంగా ఉన్నవారికి చెప్పి విలపించారు.



ప్రాణాలతో బయట పడిన ముగ్గురు స్నేహితులు

ముమ్మర గాలింపు చర్యల తర్వాత..

స్థానికులు, పిల్లల కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం చేరవేయడంతో ఒక్కసారిగా అందరూ కాలువ వద్దకు చేరుకున్నారు. గోపీచంద్, చరణ్ కనిపించకపోవడంతో గజ ఈతగాళ్లతో పట్టణ సీఐ బి.బ్రహ్మయ్య, పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. అరగంట పాటు వెతికిన తర్వాత పాదిలి చరణ్(15) మృతదేహం కనిపించింది. చరణ్ మృతదేహాన్ని కాలువలో నుంచి బయటకు తీసి సత్తెనపల్లి ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించారు. చరణ్ మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరు మున్నీరయ్యారు. గోపీచంద్ గల్లంతై కనిపించకపోవడంతో తల్లిదండ్రులు, బంధువులు గుండెలు బాదుకుంటూ రోదించారు. గల్లంతైన గోపీచంద్ కోసం సీఐ బ్రహ్మయ్య, పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది గజ ఈతగాళ్లని దింపి ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. చీకటి పడటంతో లైట్లు తీసుకువచ్చి పొక్లెయిన్ సాయంతో సమీపంలోని చెట్ల తొలగింపు చేపట్టారు. ఎక్కడైతే గోపిచంద్ గల్లంతు అయ్యాడో అక్కడ 50 మందిని కాలువలోకి దించి ఒకరికొకరు చేతులు పట్టుకొని అరకిలోమీటర్ ముందుకు సాగితే కనిపించే అవకాశం ఉంటుందని భావించి ఆ మేరకు చర్యలు చేపట్టగా 8.40 గంటలకు నల్లూరి గోపీచంద్(15) మృతదేహం కనిపించింది. విద్యార్థులు గల్లంతైన విషయం తెలియడంతో పెద్ద ఎత్తున సమీప ప్రాంత ప్రజలు కాలువ వద్దకు చేరుకున్నారు. బాధిత కుటుంబాలను వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు రాయపాటి పురుషోత్తమరావు ఓదార్చి వారికి ధైర్యం చెప్పారు.

ప్రభువా మాకెందుకు అన్యాయం చేశావయ్యా...

ప్రభువా మేము ఏ పాపం చేశాం తండ్రీ. మాకెందుకు ఇంత అన్యాయం చేశావయ్యా అంటూ గల్లంతై మృతి చెందిన నల్లూరి గోపీచంద్ తల్లిదండ్రులు కిరణ్‌కుమార్, సుహాసిని రోదిస్తున్నారు. కిరణ్ కుమార్ పట్టణంలోని ప్రైవేట్ బ్యాంకు వద్ద, సుహాసిని నరసరావుపేటలోని ప్రైవేట్ వైద్యశాల వద్ద సెక్యూరిటీ గార్డులుగా పని చేస్తూ పట్టణంలోని వడ్డవల్లి శాస్త్రీనగర్‌లో ఉంటూ జీవనం వెళ్లదీస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు. తాము చదువుకోలేక పోయామని బిడ్డలు ఇద్దరైనా ప్రయోజకులు కావాలని పెద్ద కుమారుడు ప్రసన్నకుమార్‌ను గుంటూరులో డిగ్రీ ప్రథమ సంవత్సరం, చిన్న కుమారుడు గోపిచంద్‌ను సత్తెనపల్లిలో తొమ్మిదో తరగతి చదివిస్తున్నారు. చిన్న కుమారుడు స్నేహితులతో కలిసి వెళ్లి కాలువలో గల్లంతై మృతి చెందడంతో ఆ కుటుంబం తీవ్ర విషాదంలో మునిగి పోయింది.

చదువుకునేందుకు వచ్చి..

ఈతకు వెళ్లి గుంటూరు బ్రాంచ్ కెనాల్ కాలువలో మృతి చెందిన పాదిలి చరణ్‌ది యడ్లపాడు మండలం లింగారావుపాలెం గ్రామం. పాదిలి భాస్కర్, కృష్ణకుమారి దంపతులకు ఇద్దరు కుమారులు. చిన్న కుమారుడు పాదిలి చరణ్‌ను సత్తెనపల్లి రాజుపాలకాలనీలో లస్కర్‌గా పని చేస్తున్న తాతయ్య రాచకొండ జగన్నాథం వద్ద ఉంచారు. రెండేళ్ల నుంచి చరణ్ ఇక్కడే ఉంటూ ప్రైవేటు పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. సరదాగా స్నేహితులతో ఈతకు వెళ్లి కాలువలో గల్లంతై మరణించాడు. దీంతో అతని తల్లిదండ్రులు, బంధువులు కన్నీరు మున్నీరుగా విలపించారు. చదువుకునేందుకు వచ్చి విగతజీవిగా మారావా అంటూ రోదించారు.



పాదిలి చరణ్ మృతదేహం

జిల్లాలో మార్కెట్ యార్డులకు

రిజర్వేషన్ల ఖరారు

సంక్రాంతి నాటికి పాలకవర్గాల నియామకం జరిగే అవకాశం



నరసరావుపేట: జిల్లాలోని 12 మార్కెట్ యార్డుల రిజర్వేషన్లు ఖరారయ్యాయి. వారం క్రితమే జిల్లా కలెక్టర్ రిజర్వేషన్లను ఖరారు చేస్తూ నిర్ణయం తీసుకున్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. వీటికి జిల్లాలోని ఏడుగురు టీడీపీ ఎమ్మెల్యేలు ఆమోద ముద్ర వేశారు. వచ్చే సంక్రాంతి నాటికి పాలకవర్గాలను నియమించాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. ప్రతి కమిటీకి గౌరవ చైర్మన్‌గా ఆ నియోజకవర్గ ఎమ్మెల్యే కొనసాగుతారు. నామినేటెడ్ చైర్మన్, వైస్ చైర్మన్లతో కలిపి 12 మంది సభ్యులు, నలుగురు ఎక్స్ అఫీషియో సభ్యులు నియమితులు కానున్నారు. సభ్యుల్లో కూటమిలోని మూడు పార్టీలకు చెందిన వారికి స్థానం కల్పించే అవకాశం ఉంది. యార్డుల వారీగా రిజర్వేషన్లు పరిశీలిస్తే.. నరసరావుపేట (ఓసీ-జనరల్), రొంపిచర్ల (ఎస్సీ-మహిళ), వినుకొండ (బీసీ) ఈపూరు (ఎస్టీ-మహిళ), చిలకలూరిపేట(ఓసీ-జనరల్), సత్తెనపల్లి (ఓసీ-మహిళ), రాజుపాలెం (బీసీ), మాచర్ల (బీసీ-మహిళ), దుర్గి(ఓసీ-జనరల్), క్రోసూరు(ఓసీ-మహిళ), పిడుగురాళ్ల (ఎస్సీ-మహిళ), గురజాల (ఓసీ-జనరల్)గా రిజర్వు చేశారు.

సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద ఆదివారం 1516 క్యూసెక్కులు విడుదల చేశారు. బ్యాంక్ కెనాల్‌కు 148, తూర్పు కెనాల్‌కు 200, పశ్చిమ కెనాల్‌కు 100, నిజాంపట్నం కాలువకు 50, కొమ్మమూరు కాలువకు 975 క్యూసెక్కులు విడుదల చేశారు.



పాటిబండ్లలో పుట్టిన మత గురువులు

'దివ్య' తేజస్సు


పాటిబండ్లలో ఆధ్యాత్మిక సందడి

- వైభవంగా ముగ్గురు రాజులు ఆలయ శత వార్షికోత్సవాలు
- వందలాది మంది మత గురువులతో ప్రత్యేక దివ్యపూజ బలి
- వేలాదిగా తరలివస్తున్న కతోలిక్‌లు
- నిత్యం 20 వేల మందికి అన్నదానం
- అలరిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు
- నేడు తరలిరానున్న తెలుగు రాష్ట్రాల పీఠాధిపతులు

పెదకూరపాడు: కతోలిక్‌ల పుణ్యభూమి పాటిబండ్ల గ్రామంలో ముగ్గురు రాజులు దేవాలయ శత వార్షికోత్సవ వేడుకల సందర్భంగా ఆధ్యాత్మిక సందడి నెలకొంది. వేలాదిగా తరలివస్తున్న రోమన్ కతోలిక్‌లు, వందలాదిగా తరలివచ్చిన మత గురువులు, మఠకన్యలు, విదేశీ భక్తులతో కోలాహలంగా మారింది. వార్షికోత్సవాల్లో భాగంగా రెండో రోజు నల్లపాడు సీనియర్ గురువులు రెవరెండ్ ఫాదర్ అల్లం శౌర్రెడ్డి పాటిబండ్ల గ్రామంలో పుట్టి వివిధ ప్రదేశాల్లో గురువులుగా బాధ్యతలు నిర్వహిస్తున్న 60 మంది మత గురువులతో కలిసి ప్రత్యేక దివ్యబలిపూజ నిర్వహించారు. దాచేపల్లి విచారణ గురువులు రెవరెండ్ ఫాదర్ యేరువ బాలశౌర్రెడ్డి ప్రత్యేక సందేశాన్ని అందించారు. ఈ లోక ఆశలను వీడి, దేవుని ప్రేమలో నిలవాలని కోరారు. 100 సంవత్సరాలు చరిత్ర కలిగిన ముగ్గురు రాజులు దేవాలయం అనేక మందిని దేవుని సేవలో, ప్రేమలో నిలిపిందన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో పుట్టి వివిధ ప్రాంతాల్లో దైవసేవలో ఉన్న 60 మంది గురువులు, 200 మంది మఠకన్యలు ఒకే చోటకు చేరి సందడి చేశారు. వేడుకలు విజయవంతం చేసేందుకు ఆర్థిక, సామాజిక సహాయం అందించిన వారికి స్థానిక విచారణ గురువులు చిన్నాబత్తిన హృదయ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.



పాటిబండ్ల ప్రత్యేక దివ్యబలిపూజ నిర్వహిస్తున్న ఫాదర్ రెవరెండ్ అల్లం శౌర్రెడ్డి



విద్యుద్దీప కాంతుల్లో ముగ్గురు రాజులు దేవాలయం

నేడు తెలుగు రాష్ట్రాల పీఠాధిపతులు రాక

ముగ్గురు రాజులు ఆలయ శత వార్షికోత్సవం సందర్భంగా చివరి రోజు సోమవారం ఉమ్మడి తెలుగు రాష్ట్రాల నుంచి 14 మంది పీఠాధిపతులు పాటిబండ్ల గ్రామాన్ని దర్శించనున్నారు. గుంటూరు పీఠాధిపతులు మహోఘన, రైట్ రెవరెండ్ చిన్నాబత్తిన భాగ్యయ్యతోపాటు 14 మంది పీఠాధిపతులు ప్రత్యేక దివ్యబలిపూజ నిర్వహించనున్నారు. శ్రీకాకుళం పీఠాధిపతులు మహోఘన రైట్ రెవరెండ్ డాక్టర్ రాయరాల విజయకుమార్ దేవుని సందేశం ఇవ్వనున్నారు. సాయంత్రం కోలాటం, బాణసంచాలతో ఊరేగింపు నిర్వహించనున్నట్లు విచారణ గురువు చిన్నాబత్తి హృదయ కుమార్ తెలిపారు. తిరునాళ్ల కూడా జరగనుంది.

అలరించిన సినీ సంగీత గాన లహరి

ముగ్గురు రాజులు ఆలయ శత వార్షికోత్సవం సందర్భంగా నిర్వాహకులు ఏర్పాటు చేసిన క్రీస్తు సంగీత గాన లహరి ఆకట్టుకుంది. గాయకులు ఆలపించిన క్రీస్తు భక్తిగీతాలు అలరించాయి. గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి భక్తులు డప్పు వాయిద్యాలతో, భారీ బాణసంచా కాల్చుకుంటు, మొక్కులు తీర్చుకునేందుకు మోకాళ్లపై నడిచి దేవుని ఆలయానికి చేరుకుని కొవ్వొత్తులు సమర్పించారు.

మూడురోజులుగా నిత్యాన్నదానం

శత వార్షికోత్సవం సందర్భంగా మూడు రోజులు నిత్యం 25 వేల మందికి అన్నదానం నిర్వహిస్తున్నారు. తిరునాళ్లకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా అన్నపానీయాలు అందుబాటులో ఉంచారు. ఆలయ ప్రాంగణం మొత్తం చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. పలు ప్రాంతాల నుంచి వర్తకులు వచ్చి దుకాణాలు ఏర్పాటు చేసుకుని విక్రయాలు జరుపుతున్నారు.

ప్రభుత్వ శాఖల విద్యుత్ బకాయిలు రూ.437 కోట్లు

- వసూలైనవి రూ.149 కోట్లు
- న్యాయశాఖ మినహా మిగతా విభాగాలన్నింటిలోనూ బకాయిలు



మున్సిపల్ కార్యాలయం

నరసరావుపేట: ప్రభుత్వ సంస్థలు, కార్యాలయాలు విద్యుత్ శాఖకు భారీగా బకాయిలు పడ్డాయి. పల్నాడు జిల్లా సూపరింటెండెంట్ పరిధిలోని హైటెన్షన్, లో–టెన్షన్ విభాగాల్లో మొత్తం రూ.437 కోట్లు పేరుకుపోవటం విశేషం. ఒక్క న్యాయశాఖ మినహా మిగతా అన్ని విభాగాల్లోనూ బకాయిలు భారీగా పేరుకుపోయాయి. వీటిలో గతేడాది నవంబరు ఆఖరునాటికి హెచ్‌టీ విభాగంలో రూ.218 కోట్లు, ఎల్‌టీ విభాగంలో రూ.219 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా లోటెన్షన్(ఎల్‌టీ) విభాగంలో ఏడు ఈఆర్‌వో(ఎలక్ట్రిసిటీ రెవెన్యూ ఆఫీసర్) సెక్షన్లు ఉన్నాయి. నరసరావుపేట ఈఆర్‌వో సెక్షన్, రొంపిచర్ల సబ్ ఈఆర్వో సెక్షన్లలో 508 ప్రభుత్వ సర్వీసులు ఉన్నాయి. మొత్తం బకాయిలు రూ.15.84 కోట్ల వరకు ఉన్నాయి. వీటిలో లక్షలకు లక్షలు కరెంటు బకాయిలు చెల్లించాల్సిన సర్వీసులు అనేకం ఉన్నాయి. డీ–1 సెక్షన్ పరిధిలో 122 ప్రభుత్వ సర్వీసులు ఉండగా వాటిలో కొన్ని పరిశీలిస్తే.. సత్తెనపల్లిరోడ్డులోని శ్రీ కోడెల శివప్రసాదరావు స్టేడియం(డీఎస్‌ఏ) రూ.1.09 లక్షలు, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం రూ.1.48 లక్షలు, మున్సిపల్ బాలుర హైస్కూలు రూ.4.02 లక్షలు, బాలికల హైస్కూలు రూ.3,30 లక్షలు, ఏపీ ఫైబర్ నెట్ బకాయి రూ.12 లక్షలు ఉంది. మొత్తం బకాయిలు రూ.1.04 కోట్లు ఉన్నాయి. అలాగే డీ–2 సెక్షన్ పరిధిలో 186 సర్వీసులు ఉండగా మొత్తంపై రూ.12.02 కోట్లు బకాయిలు ఉన్నాయి. వీటిలో మున్సిపల్ పార్కు రూ.3.35 లక్షలు, ప్రభుత్వ వైద్యశాల రూ.62.63 లక్షలు, ఆర్అండ్‌బీ డిపార్టుమెంట్‌రూ.1.25 లక్షలు, తహసీల్దార్ కార్యాలయం రూ.28.38 లక్షలు, సబ్‌జైలు రూ.5.62 లక్షలు, జిల్లా వైద్యఆరోగ్యశాఖ కార్యాలయం రూ.1.65 లక్షలు బకాయిలు ఉన్నాయి. అలాగే డీ–3 సెక్షన్ పరిధిలో 246 సర్వీసులు మొత్తం బకాయిలు రూ.1.64 కోట్లు ఉండగా వాటిలో కోటప్పకొండలోని ఆర్‌డబ్ల్యూఎస్ విభాగం రూ.7.86 లక్షలు, ఫారెస్టు విభాగం రూ.1.33 లక్షలు, మెడికల్ ఆఫీసర్ కార్యాలయం రూ.3.99 లక్షలు, పంచాయతీరాజ్ సెక్షన్ రూ.6.63 లక్షలు, ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ కార్యాలయం రూ.29.75 లక్షలు, ఏపీ టూరిజం రూ.1.20 లక్షలు, బీసీ కాలనీలోని ఎన్ఎస్పీ ఎస్ఈ కార్యాలయం రూ.3.24 లక్షలు ఉన్నాయి. రొంపిచర్ల సెక్షన్‌లో రూ.47.86 లక్షలు బకాయి ఉండగా వాటిలో ఎంపీడీఓ కార్యాలయం బకాయి రూ.1.95 లక్షలు, తహసీల్దార్ కార్యాలయం రూ.9.27 లక్షలు, విప్పర్ల పీహెచ్‌సీ రూ.6.84 లక్షలు బకాయిలు ఉన్నాయి. అలాగే నకరికల్లు సెక్షన్‌లో మొత్తం బకాయిలు రూ.67.78 లక్షలు బకాయిలు ఉన్నాయి.

హెచ్‌టీ సెక్షన్ బకాయిలకు ప్రభుత్వం రూ.81 కోట్లు చెల్లించింది



జిల్లా పరిధిలో ప్రభుత్వ సర్వీసుల నుంచి బకాయిలు భారీగా ఉన్నాయి. వాటిలో హెచ్‌టీ సెక్షన్‌లో రూ.218 కోట్లు ఉండగా గత నెలలో రూ.81 కోట్ల వరకు వసూలుచేశాం. మిగతా బకాయిలను వసూలుచేస్తాం.

– గుంటూరు విజయకుమార్, సూపరింటెండెంట్ ఇంజనీర్, విద్యుత్‌శాఖ

ఇటీవలనే రూ.కోటి చెల్లించాం



మున్సిపాలిటీ విద్యుత్ బకాయిల్లో రూ.కోటి మొత్తాన్ని 15వ ఫైనాన్స్ నిధుల నుంచి ఆ సంస్థకు చెల్లించాం. మిగతా రూ.80లక్షల వరకు త్వరలో చెల్లించేస్తాం.

– ఎం.జస్వంతరావు, మున్సిపల్ కమిషనర్

జిల్లాలో లోటెన్షన్ విభాగంలో మొత్తం బకాయిలు ఇలా ఉన్నాయి.

ఈఆర్వో	సర్వీసులు	బకాయిలు (రూ.కోట్లు)	కలెక్షన్ (రూ.కోట్లు)	మిగులు (రూ.కోట్లు)
నరసరావుపేట	1,575	14.76	4.13	10.63
సత్తెనపల్లి	1,367	13.09	3.59	09.50
వినుకొండ	1,483	14.65	4.02	10.62
దాచేపల్లి	986	36.86	12.38	24.47
గురజాల	1199	47.47	15.2	32.26
మాచర్ల	1547	75.68	25.18	50.50
పిడుగురాళ్ల	1091	1.77	57.06	120.04
మొత్తం	9248	219.60	68.08	150.08

నేటి నుంచి జిల్లాలో హెల్త్ పింఛన్ల వెరిఫికేషన్

- పరిశీలనకు ఐదు బృందాలు ఏర్పాటు
- ఈనెల 28 వరకు కొనసాగింపు
- మొత్తం 1,035 మంది పింఛన్ల తనిఖీ

నరసరావుపేట: జిల్లాలో అత్యధికంగా పింఛన్ పొందుతున్న వారిని తగ్గించి ఆర్థిక భారాన్ని తగ్గించుకునేందుకు ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. వికలాంగులు, మంచానికే పరిమితమైన వారిలో వైఎస్సార్ సీపీకి చెందినవారున్నారని గత కొంతకాలంగా మంత్రులు, టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో వెరిఫికేషన్ పేరుతో వైఎస్సార్ సీపీ సానుభూతిపరుల పింఛన్లపై వేటు వేసి తమ పార్టీ వారికి పింఛన్లు అందజేయాలనే కుటిల ఆలోచనతో తనిఖీలు, వైద్య పరీక్షలకు శ్రీకారం చుట్టింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పార్టీలు, కుల, మతాలకు అతీతంగా పింఛన్లు అందజేసిన విషయం విదితమే.

ఐదు బృందాలతో వెరిఫికేషన్

పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని మండలాలు, మున్సిపాలిటీల్లోనూ రీ అసెస్మెంట్, హెల్త్, వికలాంగుల పెన్షన్ల వెరిఫికేషన్ సోమవారం నుంచి చేపట్టనున్నారు. దీనికోసం జిల్లా గ్రామీణాభివృద్ధి పథక సంచాలకులు బాలునాయక్, జిల్లా వైద్యశాఖాధికారి డాక్టర్ బి.రవి, ప్రభుత్వ వైద్యశాలల పర్యవేక్షణాధికారి డాక్టర్ బీవీ రంగారావు ఆధ్వర్యంలో డాక్టర్లను ఐదు బృందాలుగా ఏర్పాటు చేశారు. వీరు అన్ని మండలాల్లోని 1,035 మంది లబ్ధిదారులను పరిశీలించనున్నారు.

ప్రాంతాల వారీగా వెరిఫికేషన్ ఇలా..

ఈనెల 6న నరసరావుపేట, వినుకొండ మున్సిపాలిటీలు, పిడుగురాళ్ళ, కారంపూడి, అమరావతి మండలాలలో వెరిఫికేషన్ నిర్వహిస్తారు. 7న నరసరావుపేట, వినుకొండ, మాచర్ల, క్రోసూరు మండలాలు, పిడుగురాళ్ళ మున్సిపాలిటీల్లోను, 8న రొంపిచర్ల, ఈపూరు, దాచేపల్లి, బెల్లంకొండ మండలాలు, మాచర్ల మున్సిపాలిటీలోను, 16న చిలకలూరిపేట, బొల్లాపల్లి, గురజాల, వెల్దుర్తి, పెదకూరపాడు మండలాలు, 17న చిలకలూరిపేట మున్సిపాలిటీ, నూజండ్ల, మాచవరం, రెంటచింతల, అచ్చంపేట మండలాలు, 18న నాదెండ్ల, శావల్యాపురం, సత్తెనపల్లి, దుర్గి మండలాలు, 21న యడ్లపాడు మండలంతో పాటు, సత్తెనపల్లి మున్సిపాలిటీ, 22న రాజుపాలెం మండలం, 23న ముప్పాళ్ళ మండలం, 28న నకరికల్లు మండలంలోని మంచానికే పరిమితమైన పేషెంట్లను, వికలాంగుల వద్దకు డాక్టర్లు వెళ్లి పరీక్షిస్తారు. ఇదిలా ఉంటే హెల్త్ పింఛన్ల లబ్ధిదారుల్లో అత్యధికంగా అమరావతిలో 62 మంది ఉండగా, అత్యల్పంగా సత్తెనపల్లి మున్సిపాల్టీలో 8 మంది ఉన్నారు.

క్లుప్తంగా

ప్రణాళికతో శ్రమిస్తే విజయం సొంతం



పెదకాకాని: ప్రణాళికాబద్ధంగా కష్ట పడితే విజయం సొంతం అవుతుందని వాణిజ్య పన్నుల శాఖ విశ్రాంత ఐఆర్ఎస్ అధికారి వై. సత్యనారాయణ అన్నారు. పెదకాకాని మండలంలోని వెనిగండ్ల కౌండిన్య ఐఏఎస్ అకాడమీ భవనంలో ఆదివారం మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే దంపతులను స్మరిస్తూ 'విద్యావకాశాలు- ఉద్యోగాల సాధన' అంశంపై సదస్సు ఏర్పాటు చేశారు. దీనికి అధ్యక్షత వహించిన ఆయన మాట్లాడుతూ... పూలే దంపతులు స్ఫూర్తి ప్రదాతలు అన్నారు. నేటి యువతకు ఎన్నో సదుపాయాలు, అద్భుత అవకాశాలు ఉన్నాయని గుర్తుచేశారు. అకాడమీ వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ ఈవీ నారాయణ మాట్లాడుతూ.. ప్రతిభ కలిగిన పేద, మధ్యతరగతి విద్యార్థులను ప్రోత్సహించడమే తమ లక్ష్యం అన్నారు. ఐటీ విశ్రాంత ప్రధాన అధికారి టి. తిరుమల కుమార్ మాట్లాడుతూ.. ప్రణాళికాబద్ధంగా కఠిన శ్రమ చేస్తే ఎలాంటి ఉద్యోగమైనా వచ్చి తీరుతుందన్నా రు. తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ ఉన్నతాధికారి మస్తానయ్య మాట్లాడుతూ.. చిన్న వయసు నుంచే తమ వృత్తి, ప్రవృత్తితోపాటు సామాజిక బాధ్యతను కూడా ప్రతిఒక్కరు స్వీకరించాలన్నారు. అప్పుడే సమాజం బాగుంటుందని చెప్పారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆచార్యుడు ఎం. చంద్రశేఖర్ మాట్లాడుతూ.. పర్యావరణానికి సంబంధించిన అంశాలను వివరించారు. ఏపీఎస్‌డీపీడబ్ల్యూసీ ఎండీ ఎంఏ కుమార్ రాజా కంప్యూటర్ పరిజ్ఞానం అవసరాన్ని తెలిపారు. తొలుత పూలే దంపతుల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో డాక్టర్ నారాయణ, ప్రసాద మూర్తి, గౌడ జన సేవా సమితి సభ్యులు పామర్తి సాంబశివరావు, జల్లెడ శ్రీనివాసరావు, వాకా రాంగోపాల్ గౌడ్, బెల్లంకొండ సదాశివ గౌడ్, డాక్టర్ టి. సేవ కుమార్, డాక్టర్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఈ- బస్సుల నిర్వహణ ఆర్టీసీకే అప్పగించాలి

లక్ష్మీపురం: విద్యుత్ బస్సులను ప్రైవేటు సంస్థల ద్వారా కాకుండా నేరుగా ఆర్టీసీ ద్వారానే నిర్వహించాలని స్టాఫ్ వర్కర్స్ ఫెడరేషన్ గుంటూరు జిల్లా కమిటీ కార్యదర్శి టి.వి.జి. రవిశంకర్ ఆదివారం పేర్కొన్నారు. అలా చేయకుంటే ఆర్టీసీ గ్యారేజ్‌లన్నీ మూతపడతాయని, క్రమంగా ఆర్టీసీ నామమాత్రంగా మిగులుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన పాలసీలో ఆర్టీసీలకు సబ్సిడీ వచ్చేలా మార్పు తేవడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నం చేయాలని కోరారు. విద్యుత్ బస్సులు ఆర్టీసీకి కేటాయించాలని కోరుతూ మంగళవారం విజయవాడలో రాష్ట్ర కమిటీ సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ప్లస్‌టు పాఠశాలల రద్దు ఆలోచన విరమించుకోవాలి

ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి రఘునాథరెడ్డి



మాట్లాడుతున్న ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి

నరసరావుపేట రూరల్: ప్లస్‌టు పాఠశాలల రద్దు ఆలోచనలను రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోవాలని ఎస్టీయూ ఏపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి కోరారు. జిల్లా వార్షిక కౌన్సిల్ సమావేశం ఆదివారం పట్టణంలోని నూతన కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు ఎల్‌వీ రామిరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర ప్రధానకార్యదర్శి రఘునాథరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్లస్ టు పాఠశాలలను రద్దు చేయాలని ప్రయత్నిస్తుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలు ఎక్కువగా ఉండే పల్నాడు జిల్లాలకు విద్యాపరంగా ఈ నిర్ణయం తీవ్ర నష్టం కల్గిస్తుందని అన్నారు. జిల్లాలో విద్యను అభివృద్ధిలోకి తీసుకురావాల్సి ఉండగా ప్లస్‌టు రద్దు నిర్ణయం కారణంగా ఇంకా వెనక్కి వెళ్తుందని పేర్కొన్నారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎస్టీయూ జిల్లా శాఖ సమస్యల పోరాటంలో అన్ని సంఘాల కంటే మెరుగ్గా పనిచేస్తుందని అన్నారు. ఉపాధ్యాయ సమస్యలు, విద్యార్థులు విద్యాభివృద్ధిపై భవిష్యత్‌లో ఇలాంటి పోరాటాలు చేయాలని కోరారు. ఏఐటీఎఫ్ జాతీయ ఆర్థిక కార్యదర్శి సీహెచ్ జోసఫ్ సుధీర్‌బాబు మాట్లాడుతూ నూతన ప్రభుత్వం వచ్చిన వెంటనే సమస్యలు పరిష్కరిస్తామని చెప్పి పాత సమస్యలను అలాగే కొనసాగిస్తుందన్నారు. పిఆర్‌సీ కమిటీని వెంటనే నియమించి మెరుగైన పీఆర్సీ వెంటనే ప్రకటించాలని కోరారు. పీఆర్సీ కమిటీ వచ్చేలోగా మధ్యంతర భృతిని 35శాతం ప్రకటించి ఉద్యోగ, ఉపాధ్యాయులకు మేలు చేకూరేలా చర్యలు తీసుకోవాలనికోరారు. పీజీఎల్ఐ, పీఎఫ్, డీఏల బకాయిలు ఉద్యోగులకు వేల కోట్లలో బకాయిలు ఉన్నాయని, వెంటనే చెల్లింపులు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రజిత్ యాదవ్, సీపీఐ జిల్లా కార్యదర్శి ఏ.మారుతీవరప్రసాద్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కాసా రాంబాబు, రాష్ట్ర అసోసియేషట్ అధ్యక్షుడు ఎస్ఎం సుభాని, ఉపాధ్యక్షులు గంగాధర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

రణక్షేత్రంలో వీరాచారులు పూజలు


చెన్నకేశవస్వామి ఆలయం ముందు కత్తి సేవ చేస్తున్న ఆచారవంతుడు

కారెంపూడి: చెన్నకేశవస్వామి, వీర్ల అంకాలమ్మ తల్లిని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన ఆచారవంతులు ఆదివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి ఆదివారం ఏదో ఒక ప్రాంతం నుంచి ఆచారవంతులు వస్తూనే ఉన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా వీరాచారులు వీరుల గుడికి తరలి వచ్చి అక్కడ వివిధ కార్యక్రమాలు నిర్వహించుకుని తర్వాత వీరుల ఆయుధాలతో ఊరేగింపుగా చెన్నకేశవస్వామి, అంకాలమ్మలను దర్శించుకుని మొక్కులు చెల్లిస్తున్నారు. వారు కత్తిసేవలు కూడా కొనసాగిస్తున్నారు. వివిధ కారణాల వల్ల పల్నాటి వీరారాధన ఉత్సవాలకు రాలేని ఆచారవంతులు ఇలా వచ్చి మొక్కులు చెల్లించుకుంటూ ఆచారాన్ని నెరవేర్చుకుంటున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఈ ఆదివారం కూడా పలు ప్రాంతాల నుంచి వీరాచారులు కారెంపూడి తరలివచ్చి చెన్నకేశవ స్వామి, అంకాలమ్మలకు మొక్కులు చెల్లించారు.

10న హెచ్ఎంల సంఘం జిల్లా సమావేశం


మాట్లాడుతున్న అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు బీఎం సుభాని

నరసరావుపేట రూరల్: ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా స్థాయి సర్వసభ్య సమావేశం ఈనెల 10వ తేదీన మున్సిపల్ బాలుర హైస్కూల్‌లో నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జిల్లా కార్యదర్శి రామిశెట్టి గోవిందరాజులు తెలిపారు. జిల్లా సమావేశం సన్నాహక సమావేశం ఆదివారం మున్సిపల్ హైస్కూల్‌లో నిర్వహించారు. గోవిందరాజులు మాట్లాడుతూ జిల్లా సమావేశంలో ప్రధాన ఏజెండాగా ప్రభుత్వం త్వరలో చేపటనున్న ప్రధానోపాధ్యాయుల బదిలీల చట్టంపై చర్చించనున్నట్లు తెలిపారు. దీనిపై గతంలో అసోసియేషన్ తరఫున తీర్మానం చేసి రాష్ట్ర కార్యవర్గానికి పంపినట్లు వివరించారు. బదిలీలలో కనీసం జీరో లేదా ఒక సంవత్సరం గరిష్ఠంగా ఐదు సంవత్సరాలుగా పరిగణించాలని కోరారు. ఇది కాని పక్షంలో 2023లో బదిలీలు, పదోన్నతిపై వెళ్లిన ప్రధానోపాధ్యాయులకు తప్పనిసరిగా అవకాశం కల్పించాలని తీర్మానంలో కోరినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు బీఎం సుభాని, అధ్యక్షుడు ఎ.శ్రీనివాసరెడ్డి, కార్యవర్గ సభ్యులు వై.హనుమంతరావు, ఎండీ రసూల్, బి.మల్లికార్జునరావు, వి.వెంకట్రావు, శ్రీనివాసరావు, ఎం.రామారావు పాల్గొన్నారు.

పౌరాణిక కళాకారుడు రవికుమార్‌కు జాతీయ పురస్కారం


పురస్కారం అందుకుంటున్న పౌరాణిక కళాకారుడు బెజగం రవి కుమార్

సత్తెనపల్లి: సత్తెనపల్లి పట్టణానికి చెందిన వర్ధమాన పౌరాణిక కళాకారుడు బెజగం రవికుమార్‌కు భారత రంగస్థల పౌరాణిక నట కళాతేజ గౌరవ జాతీయ పురస్కారం ఆదివారం ప్రదానం చేశారు. ప్రకాశం జిల్లా ఒంగోలు సమీపంలోని కరవాది గ్రామంలో ఏంవీఆర్ కల్చరల్ అకాడమీ, లిటిల్ ఛాంప్స్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో తెలుగు రాష్ట్రాల స్థాయిలో వివిధ రంగాలలో ప్రావీణ్యం పొందిన రంగస్థల, సాహిత్య, ఇంద్రజల, పాత్రికేయ, భరతనాట్య చిన్నారులకు పురస్కారాలను ప్రదానం చేశారు. దీనిలో భాగంగా తెలుగు రాష్ట్రాల స్థాయిలో పౌరాణిక పాత్రలు దాదాపు 16 పైగా చేసి ప్రేక్షకులను రంజింప చేసినందుకుగాను రవికుమార్‌కు ఆయా సంస్థల బాధ్యులు పురస్కారం అందించి జ్ఞాపిక, ప్రశంసాపత్రం, క్యాలెండర్, జ్ఞాపిక సన్మాన పత్రం ప్రదానం చేశారు. పురస్కర గ్రహీత రవికుమార్‌ను సత్తెనపల్లిలోని వివిధ కళా సంస్థల ప్రతినిధులు, మిత్రులు, శ్రేయోభిలాషులు, కళాకారులు ప్రత్యేకంగా అభినందించారు.

12 నుంచి ముప్పాళ్లలో జాతీయస్థాయి కబడ్డీ పోటీలు

ఈపూరు(శావల్యాపురం): సంక్రాంతి పర్వదినం సందర్భంగా ఈపూరు మండలం ఆరేపల్లి ముప్పాళ్ల గ్రామంలో ఈనెల 12 నుంచి 17వ తేదీ వరకు జాతీయ స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్న రైతు మిత్ర కమిటీ ప్రతినిధి తల్లపునేని రామారావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కబడ్డీ పోటీలకు ఉత్తర్‌ప్రదేశ్, హరియాణా, పంజాబ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, పశ్చిమ బెంగాల్, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి 50 నుంచి 60 జట్లు వస్తాయని, ఇప్పటికే సెల్‌ఫోన్ ద్వారా తమ పేర్లు నమోదు చేసుకున్నట్లు తెలిపారు. విజేతలకు రూ.9 లక్షల ప్రైజ్ మనీ అందజేస్తామన్నారు. గ్రామస్తులు, దాతల సహకారంతో రైతుమిత్ర కమిటీ సారథ్యంలో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు సెల్ నంబరు 9981922533, 9966671306, 8247479812 సంప్రదించాలన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

- పొలంలో ఘటన
- విషాదంలో కౌలు రైతు కుటుంబం


మృతుడు చెన్నకేశవరెడ్డి

మాచర్ల రూరల్: విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. వివరాలు... మాచర్ల మండలం గోపాలపురానికి చెందిన దుగ్గెంపూడి చెన్నకేశవరెడ్డి పది ఎకరాలు కౌలుకు తీసుకుని వరి సాగు చేస్తున్నాడు. కోత కోసేందుకు కూలీలలో పొలం వెళ్లాడు. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ మోటారు తీగలు కింద పడి ఉండటంతో వాటిని పక్కకు పెట్టే క్రమంలో షాక్ తగిలి మృతిచెందాడు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అధికారుల నిర్లక్ష్యంతోనే మృతి..

విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యంతోనే చెన్నకేశవరెడ్డి మృతిచెందాడని బంధువులు ఆరోపిస్తున్నారు. ఈ నెల 3వ తేదీన పొలంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను దొంగతనం చేసేందుకు దుండగులు ప్రయత్నించారు. ఈ ప్రయత్నంలో ట్రాన్స్‌ఫార్మర్ రాకపోవడంతో తీగలను దొంగలు అక్కడే వదిలి పెట్టి వెళ్లిపోయారు. చెన్నకేశవరెడ్డి ఈ విషయాన్ని విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చాడు. తీగలు కిందకు వేలాడుతున్నాయి మరమ్మతులు చేయాలని కోరాడు. విద్యుత్ శాఖ అధికారులు వస్తామని రాకుండా కాలయాపన చేశారని ఆరోపించారు.

వైభవంగా ముగ్గురు రాజుల పండుగ

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని బాల ఏసు దేవాలయంలో ఆదివారం నిర్వహించిన శ్రీసభలో ముగ్గురు రాజులు (జ్ఞానులు) పండుగను వైభవంగా నిర్వహించారు. విచారణ గురువులు మాలపాటి ఫాతిమా మర్రెడ్డి వాక్యోపదేశం చేశారు. మానవులను రక్షించేందుకు భగవంతుడు కన్నె మరియ గర్భాన శిశువు జన్మించేలా చేశాడన్నారు. ఆకాశంలో నక్షత్ర కాంతి ద్వారా ముగ్గురు జ్ఞానులు, గొర్రెల కాపరి, మరి కొందరు మాత్రమే శిశువు జన్మించిన ప్రాంతానికి వచ్చి ఆ బాలుడిని చూసి లోకరక్షకుడు జన్మించాడని గుర్తించారన్నారు. అనంతరం ప్రత్యేక దివ్యపూజాబలి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఫాదర్ పి.విలియమ్స్, సహాయ విచారణ గురువు రవీంద్ర, మఠకన్యలు, కథోళిక క్రైస్తవులు, సోడాలిటీ సభ్యులు, గుడి పెద్దలు పాల్గొన్నారు.

నేడు సత్తెనపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాబ్‌మేళా

సత్తెనపల్లి: ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ(ఏపీఎస్ఎస్ డీసీ), ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్, సీడాప్ అధ్వర్యంలో సత్తెనపల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జాబ్‌మేళా జరుగుతుందని పల్నాడు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఈ.తమ్మాజీరావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సత్తెనపల్లి నియోజకవర్గ పరిసర ప్రాంత నిరుద్యోగ యువతీ, యువకులు అందరూ ఈ జాబ్‌మేళాలో పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ జాబ్‌మేళాలో సుమారు 4 కంపెనీలు పాల్గొంటున్నాయని, విద్యార్హతను బట్టి సుమారు రూ.11 వేల నుంచి రూ.30 వేల వరకు జీతం ఉండవచ్చన్నారు. ఎస్.ఎస్.సి, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, బీ.టెక్, డిప్లొమా, ఫార్మసీ, పీజీ చదువుకున్న వారు 18–38 సంవత్సరాల వయసు గల నిరుద్యోగ యువతీ, యువకులు బయోడేటా లేదా రెజ్యూమ్, ఎడ్యుకేషన్ సర్టిఫికేట్స్ జిరాక్స్, ఆధార్ నకలు, పాస్‌పోర్ట్ ఫొటోతో నేరుగా ఇంటర్వ్యూకు హాజరు కాగలరన్నారు. ఇతర వివరాలకు రామకృష్ణారెడ్డి- 8074393466, అంజిరెడ్డి - 94949 86164 నెంబర్లలో సంప్రదించాలన్నారు. ఔత్సాహిక యువతీ, యువకులు ముందుగా httpr://naipunyam.ap.gov.in/ అనే వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకోగలరన్నారు. రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోనటువంటి యువతీ, యువకులు మేళా జరుగు ప్రదేశంలో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని సూచించారు.

తెనాలితో రాజగోపాల చిదంబరానికి ప్రత్యేక బంధం


డాక్టర్ చిదంబరానికి అవార్డు అందజేస్తున్న ఎన్.రామ్ (ఫైల్)

తెనాలి: ముంబయిలో శనివారం కన్నుమూసిన ప్రఖ్యాత భౌతిక శాస్త్రవేత్త, అణ్వస్త్ర పరీక్షల్లో కీలకభూమిక పోషించిన శాస్త్రజ్ఞుడు డాక్టర్ రాజగోపాల చిదంబరానికి తెనాలితో మరపురాని అనుబంధం ఉంది. భారత అణుశక్తి సంఘం చైర్మన్, కేంద్ర ప్రభుత్వ అణు ఇంధన శాఖ కార్యదర్శిగా ఉన్నప్పుడు డాక్టర్ చిదంబరం 1999లో తెనాలి వచ్చారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రఖ్యాతిగాంచిన తెనాలికి చెందిన శాస్త్రవేత్త డాక్టర్ యలవర్తి నాయుడమ్మ పేరిట పురస్కారాన్ని తెనాలిలో ఆయన స్వీకరించారు. నాజరుపేటలోని ఎస్‌వీఆర్ కళ్యాణమండపంలో ఆ ఏడాది నవంబరు 26వ తేదీన ఏర్పాటు చేసిన ప్రత్యేక సభకు ప్రముఖ పాత్రికేయుడు ఆర్.సంపత్ అధ్యక్షత వహించారు. ఆ సభలో ది హిందూ సంపాదకుడు ఎన్.రామ్ చేతులమీదుగా అవార్డును బహూకరించారు. ఈ సందర్భంగా 'భారత శాస్త్రీయ పరిశోధన-అభివృద్ధిలో ప్రాధాన్యతలు-ప్రాముఖ్యతలు' అనే అంశంపై డాక్టర్ చిదంబరం తనదైన శైలిలో నాయుడమ్మ స్మారకోపన్యాసం చేశారు. అభివృద్ధి చెందిన దేశాలతో సమానంగా మనం కూడా టెక్నాలజీ ప్రగతికి కలసికట్టుగా కృషి చేయాలని తన ఉపన్యాసంలో సూచించారు. నాయుడమ్మ ట్రస్ట్ వ్యవస్థాపకుడు పి.విష్ణుమూర్తి ఆనాటి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

ఆర్థికాభివృద్ధిలో బ్యాంక్ ఉద్యోగుల పాత్ర కీలకం


మాట్లాడుతున్న యూబీఐ రీజినల్ హెడ్ జవహర్

కొరిటిపాడు (గుంటూరు): దేశ ఆర్థికాభివృద్ధిలో రిజర్వు బ్యాంకు అధికారులు, ఉద్యోగుల పాత్ర మరువలేనిదని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యూబీఐ) రీజినల్ హెడ్ ఎస్.జవహర్ పేర్కొన్నారు. బ్రాడీపేటలోని పెన్షనర్స్ హోం సమావేశ మందిరంలో గుంటూరు జిల్లా బ్యాంక్ రిటైరీస్ కో ఆర్డినేషన్ కమిటీ సర్వసభ్య సమావేశం ఆదివారం సాయంత్రం నిర్వహించారు. ఇందులో జవహర్ మాట్లాడుతూ.. ఉద్యోగ విరమణ అనంతరం వారు ఎదుర్కొంటున్న సమస్యలు ఐకమత్యంతో పరిష్కరించుకోవాలని కోరారు. ఆల్ ఇండియా బ్యాంక్ రిటైర్డ్ ఫెడరేషన్ కార్యనిర్వాహక కార్యదర్శి వారణాసి కృష్ణమూర్తి, ఏపీ బ్యాంక్ రిటైరీస్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి ఎ.యల్లారావులు మాట్లాడుతూ.. జాతీయ స్థాయిలో అన్ని బ్యాంకుల అధికారులు, ఉద్యోగ సంఘాల పోరాటాల ద్వారా ఫ్యామిలీ పెన్షన్ 1.97 లక్షల మందికి సాధించుకోగలిగామని పేర్కొన్నారు. బ్యాంక్ యాజమాన్యాలు జాతీయ స్థాయిలో తీసుకున్న నిర్ణయాలను రాష్ట్ర జోనల్, రీజినల్ స్థాయి అధికారులు అమలు చేయడంలో కాలయాపన చేయడం బాధాకరమని తెలిపారు. కార్యాచరణ ప్రణాళిక ద్వారా త్వరలో సాధించుకుంటామని హామీ ఇచ్చారు. జిల్లా కో ఆర్డినేషన్ కమిటీ అధ్యక్షుడు కె.హరిబాబు మాట్లాడారు. పారిశ్రామికవేత్త ఎస్.కోటేశ్వరరావును సత్కరించారు. జిల్లా బ్యాంక్ రిటైరీస్ కో ఆర్డినేషన్ కమిటీ ప్రధాన కార్యదర్శి మురళీ కృష్ణారావు, తెలంగాణ బ్యాంక్ రిటైరీస్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి ఎన్వీ రమణ, వై.కోటేశ్వరరావు, హనుమంతరావు పాల్గొన్నారు.

గెజిటెడ్ అధ్యాపకుల సంఘ జిల్లా కార్యవర్గం ఎన్నిక


ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

గుంటూరు ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ గెజిటెడ్ అధ్యాపకుల సంఘం (జీసీజీటీఏ) జిల్లా అధ్యక్ష , కార్యదర్శులుగా ఆర్. ఏసుపాదం, డాక్టర్ జి.శ్రీనివాసులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో ఈ ఎన్నిక నిర్వహించారు. సంఘ జిల్లా కోశాధికారిగా డాక్ట్ కె.అపర్ణ సీతారామ్, ఉపాధ్యక్షుడిగా ఎం. ఏడుకొండలరావు, సంయుక్త కార్యదర్శిగా ఎస్.కుటుంబరావు ఎన్నికయ్యారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ వి. ప్రసా ఎన్నికల అధికారిగా వ్యవహరించారు., ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పని చేస్తున్న గెజిటెడ్ అధ్యాపకులు నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

తల్లులను మోసగించిన కూటమి ప్రభుత్వం

ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్ జీ

లక్ష్మీపురం: తల్లికి వందనం అమలు చేయకుండా కూట మి ప్రభుత్వం విద్యార్థుల మాతృమూర్తులను మోసగించిందని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్ జీ మండిపడ్డారు. అధికారంలోకి రాక ముందు కూటమి నాయకులు హామీ ఇచ్చారని, ఇప్పుడు రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో మాత్రం వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమలు చేయాలని నిర్ణయించినట్లు చెప్ప డం తగదన్నారు. 85 లక్షల మంది తల్లులను మోసం చేసిందని ప్రభుత్వ తీరును తప్పుపట్టారు. తల్లికి వందనం ఈ విద్యాసంవత్సరం నుంచే అమలు చేయాలని, ఫీజు రీఎంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం కొత్తపేటలోని భగత్ సింగ్ విగ్రహం నుంచి ఏఐఎస్ఎఫ్ గుంటూరు జిల్లా విభాగం ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పెండింగ్‌లో ఉన్న రూ.3,580 కోట్ల బకాయిలు విడుదల చేసి పేద విద్యార్థులకు న్యాయం చేయాలన్నారు. హామీలు అమలు చేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి యశ్వంత్ మాట్లాడుతూ.. సూపర్ సిక్స్ హామీలలో భాగంగా తల్లికి వందనం పథకాన్ని అమలు చేయకపోవడంతో లక్షలమంది తల్లులకు ఇబ్బందులు తప్పడం లేదన్నారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి ప్రణీత్, ప్రత్తిపాడు నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు డేవిడ్, అమర్నాథ్, నాయకులు అజయ్, ప్రసన్న, దిలీప్, పవన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌శాఖ ఏపీ పవర్ డిప్లొమా ఇంజినీర్స్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

నగరంపాలెం: విద్యుత్ శాఖ ఏపీ పవర్ డిప్లొమా ఇంజినీర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఆదివారం లాలుపురం సర్వీస్ రోడ్డులోని ఏఎస్ఆర్ కన్వెన్షన్‌లో జరిగింది. రాష్ట్ర అధ్యక్షుడు వీవీ.మహేశ్వరరెడ్డి అధ్యక్షత వహించారు. అనంతరం అసోసియేషన్ రాష్ట్ర నూతన కార్యవర్గం ఎన్నికగా, ఎన్నికల అధికారిగా టి.సాయిసుధాకర్ వ్యవహరించారు. చీఫ్ అడ్వయిజర్‌గా ఎ.సుబ్బారావు, అధ్యక్షునిగా కె.వి.శేషారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పి.హుస్సేన్‌ఖాన్, సెక్రటరీ జనరల్‌గా పి.సన్యాసిరావు, ఉపాధ్యక్షులుగా ఆర్.సాంబశివరావు, పి.నరేంద్ర, డిప్యూటీ సెక్రటరీ జనరల్‌గా బి.శ్రీనివాసరావు, బి.కె.మిశ్రా, ఫైనాన్స్ కార్యదర్శిగా కేవీ కోటేశ్వరరావు, ఆఫీస్ కార్యదర్శిగా కె.ప్రసాద్‌బాబు, పలువురు జాయింట్ కార్యదర్శులు, ఆర్గనైజింగ్ కార్యదర్శులను ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడు కేవీ.శేషారెడ్డి మాట్లాడుతూ విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా ఏపీ విద్యుత్‌సంస్థల్లోని నెట్ వర్క్‌ను బలోపేతం చేయాలన్నారు.

బస్సు బోల్తా.. 10 మందికి గాయాలు

హైందవ శంఖారావం సభకు వెళ్లి వస్తుండగా ప్రమాదం

చిలకలూరిపేట టౌన్: ప్రమాదవశాత్తు బస్సు బోల్తా పడిన సంఘటన చిలకలూరిపేట మండలం ఈటీ సమీపాన జరిగింది. సేకరించిన వివరాల ప్రకారం..హైందవ శంఖారావం పేరిట విజయవాడ కేసరపల్లిలో జరుగుతున్న భారీ బహిరంగసభకు ప్రకాశం జిల్లా తర్లపాడుకు చెందిన వాసులు హాజరై తిరుగు ప్రయాణిస్తుండగా రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. చిలకలూరిపేట మండలం ఈటీ వద్దకు రాగానే ప్రమాదవశాత్తు అదుపుతప్పి బోల్తా పడింది. బస్సులో 35 ప్రయాణిస్తుండగా వారిలో ఎనిమిది మందికి స్వల్పంగా, మరో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. చిలకలూరిపేట, నరసరావుపేట తదితర ప్రాంతాలకు చెందిన నాలుగు 108 వాహనాలు సంఘటనా స్థలికి చేరుకుని బాధితులను నరసరావుపేట ఏరియా ఆస్పత్రికి తరలించాయి. తీవ్రంగా గాయపడ్డ వారి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES
■ రుణాలు, వ్యక్తిగత, వ్యవసాయం, వ్యాపార రుణం తక్కువ వడ్డీరేటు, సిబిల్ అవసరం లేదు, NPA కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. సలహాలకు సంప్రదించండి : 7297898678

GOLD FINANCE
■ బంగారం కొనబడును. బ్యాంకులో ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకి తీసుకుంటాం. ✆ 83338 33368

WANTED
■ గుంటూరు ప్రఖ్యాతి గాంచిన ఎలక్ట్రికల్ 2 వీలర్ కంపెనీ నందు పనిచేయుటకు లేడీ కంప్యూటర్ ఆపరేటర్ మరియు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ సేల్స్ మేనేజర్ కావలెను. వివరాలకు. 9866515888
■ బెస్ట్ ఇన్వెస్ట్‌మెంట్ అద్భుతంలో భాష్యం వారి గ్రీన్ సిటీ నందు పూర్తిగా అభివృద్ధి పరచిన అప్రూవ్ వెంచర్‌లో 3 సెంట్స్ నుండి హౌసింగ్ ప్లాట్స్ కలవు. సెంటు రూ.4 లక్షల 50 వేలు మాత్రమే తక్షణ గృహ నిర్మాణానికి అనువైన ప్రదేశం. బ్యాంక్ లోన్ సౌకర్యం కలదు. సంప్ర: రమాదేవి: 80188 09724
■ వర్క్‌ఫ్రమ్‌హోమ్ అవకాశం, ఇంట్లో పని చూసుకుంటూ తీరిక సమయంలో Online లో వర్క్ చేసుకోవచ్చు.2 or 3గం|| 20K-30K. వ: 20–50సం||☏8500848714, 9515730117
■ ఉద్యోగ అవకాశం కోసం ఎదురు చూస్తున్నారా మా MNC కంపెనీలో వర్క్ ఫ్రం హోం. స్త్రీ పురుషులు కావలెను. Qul: 10- డిగ్రీ, మంచిజీతం,ఉచిత రూము భోజన సదుపాయం.9353453795, 9036607717
■ ప్రముఖ కంపెనీకి మీ ఇంటి వద్దనే వుంటూ ఒక గంట పార్ట్ టైం మాన్యువల్ వర్క్ చేయుటకు స్త్రీ / పు కావలెను. వీక్లీ పేమెంట్స్ మీ పేరు వాట్సాప్ చేయండి. 7702473849
■ ప్రముఖ బ్యాంక్ అనుబంధ సంస్థకు పని చేయుటకు ఇంటర్ అర్హత గల 25-35 సంవత్సరాలు గల హార్డ్‌వర్క్ చేయగల స్త్రీ పురుషులు కావలెను. జీతం: 10000 ఆపైన Cont: 9505177327
■ Wanted B-Patmacy or D-Pharmacy Candidates to work in a Pharmacy in Guntur City PCI Certificate Registration mandatory Cont: 6300975241
■ తెనాలిలోని ప్రముఖ ట్రాన్స్‌పోర్ట్స్ కం|| నందు పనిచేయుటకు MBA అర్హత గల మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ (ఫ్రెషర్స్) కావలెను. మంచి జీతం. సంప్ర: 9490157852, 7815829857
■ మంగళగిరి బ్రాంచ్‌లో పనిచేయడానికి బైక్ డెలివరీ బాయ్స్ కావలెను. మంగళగిరి లోకల్ వారికి ప్రాధాన్యత.బైక్, స్మార్ట్‌ఫోన్, DL మస్ట్. నెల సంపాదన:15K-20K. 8686242288, 9059910338
■ త్రివేణి హోంకేర్‌లో వృద్ధులను, పేషెంట్లను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం. జీ : 18K. Ph: 9640400073, 9160900024
■ రూ. 5,000/- జీతం 10 to 2 pm అనుభవమున్న టెలీకాలర్స్, డోర్ టు డోర్ బిజినెస్ కార్డ్స్ పంచుటకు జీతం : 10,000/- pm కొరిటిపాడు రోడ్డు, గుంటూరు ✆ 90524 70111

సాక్షి క్లాసిఫైడ్స్
గుంటూరు ప్యాక్ రూ.475/- మాత్రమే (4 లైన్లు)
ప్రతి అదనపు లైను రూ.100/- మాత్రమే
ప్రతి 3 ప్రకటనలకు 2 ప్రకటనలు ఉచితం
ఈ పేపర్‌లో ప్రకటనల కొరకు సంప్రదించండి
గుంటూరు
7075167663
7075167541

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

SBI స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా
ఎస్ఎమ్ఇ బ్రాంచి, గుంటూరు (6830), డోరు నెం.3-28-1914, జి.సుదర్శినీదేవి కాంప్లెక్స్, 3వ అంతస్తు, క్రోమా మాల్‌పైన, బృందావన్ గార్డెన్స్ 3వలైను, మెయిన్ రోడ్డు, స్పెన్సర్స్ ఎదురు, గుంటూరు-522006, ఫోన్: 0863-2231313

స్వాధీనత ప్రకటన రూల్ 8(1) (స్థిరాస్తుల కొరకు)

[illegible] ... మెస్సర్స్ ఆర్‌పియస్ జ్యూవెలరీ ప్రైవేట్ లిమిటెడ్ ... 2) శ్రీమతి పోతుల రేవతి ... 3) శ్రీమతి ... 4) శ్రీ పులిమి శ్రీనివాసరావు ... [illegible] ... ది.24-10-2024 నాటికి రూ.3,02,18,726/- (అక్షరాల మూడు కోట్ల రెండు లక్షల పద్దెనిమిది వేల ఏడు వందల ఇరవై ఆరు రూపాయలు మాత్రము) ... ది.24-10-2024 న డిమాండ్ నోటీసు జారీచేయబడినది. ... ది.02-01-2025 న ... స్వాధీనత ... ది.24-10-2024 నాటికి రూ.3,02,18,726/- ... [illegible]

(బ్యాంకుకు తనఖాపెట్టబడిన స్థిరాస్తుల వస్తావేజుల వివరములు షెడ్యూలు -వీ నందు పేర్కొనబడినవి).

బ్యాంకుకు తనఖాపెట్టబడిన స్థిరాస్తుల వివరములు
ది.30-07-2004 నాటి రిజిస్టర్ పార్టీషన్ డీడ్ దస్తావేజు నెం.3022/2004 ప్రకారం శ్రీ పులిమి శ్రీనివాసరావు, తండ్రి : లేటు లక్ష్మీ నారాయణ ... [illegible] ... హద్దులు : తూర్పు : ... 44.00 అం||లు, దక్షిణం : ... 43.00 అం||లు, పడమర : ... 39.00 అం||లు, ఉత్తరం : ... 45.20 అం||లు. ... ది.24-10-2024 నాటికి ... రూ.3,02,18,726/- ... [illegible]
తేదీ: 02-01-2025 ప్రదేశం: గుంటూరు
సం/- అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎస్ఎమ్ఇ బ్రాంచ్, గుంటూరు